క్లుప్తంగా

నిబంధనలు పాటించాలి



వీపనగండ్ల: ప్రభుత్వ నిబంధనల మేరకు వైన్ షాపులో మద్యం విక్రయించాలని కొత్తకోట ఎక్సైజ్ సీఐ కరుణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వైన్ షాపులు ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లోని బెల్టు షాపులకు మద్యం విక్రయించొద్దని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మద్యాన్ని విక్రయించాలని ఆమె ఆదేశించారు. గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులను కొనసాగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్‌ఐ గోవర్ధన్, పలువురు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలకు అవగాహన



గోపాల్‌పేట: మహిళా శిశు సంక్షేమ శాఖ బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో తాడిపర్తిలోని ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలల హక్కులు, రక్షణ చట్టాలు, బాల్య వివాహ చట్టాలు, బాలికలపై లైంగిక వేధింపుల చట్టాలు, బాల కార్మికుల చట్టాల అవగాహన కల్పించారు. మహిళలకు లేదా బాలలకు ఎటువంటి ఇబ్బందులు కలిగినా వెంటనే 100 డయల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో చైల్డ్‌హెల్ప్‌లైన్ కేస్ వర్కర్ రాజు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

బాధితుడికి ఎల్వోసీ అందజేత



పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని వినాయకనగర్ కాలనీకి చెందిన కొండ్రా చిన్న రంగన్న కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని పంజాగుట్టలో గల నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయాన్ని ఏఐసీసీ కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్యారెడ్డి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. మంజూరైన రూ 2.50 వేల ఎల్‌ఓసీ కాపీని గురువారం స్థానిక కాంగ్రెస్ నాయకులు వెంకట్రాములు లబ్ధిదారుడికి అందజేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



గోపాల్‌పేట: తాళం వేసిన ఇంట్లో బీరువాలో దాచుకున్న రూ.ఇరవై వేలు దొంగలు ఎత్తుకెళ్లారు. ఈఘటన రేవల్లి మండలంలోని కొత్త బండరావిపాకులలో చోటుచేసుకుంది. రేవల్లి ఎస్‌ఐ తిరుపతిరెడ్డి కథనం మేరకు.. బండరావిపాకులకు చెందిన గంగనమోని వెంకటేష్ ఇల్లు నిర్మాణంలో ఉండగా.. సమీపంలోని శానాయిపల్లిలో ఓ ఇల్లు కిరాయికి తీసుకొని నివాసం ఉంటున్నాడు. మంగళవారం గోపాల్‌పేట మండలంలోని బుద్దారంలో పెళ్లికి వెళ్లాడు. తిరిగి ఇంటికి బుధవారం సాయంత్రం ఎనిమిది గంటల ప్రాంతంలో వచ్చి చూడగా.. ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరుచుకుని వస్తువులు చెల్లాచెదురుగా పడ్డాయి. ఇంట్లో దాచుకున్న నగదు రూ.ఇరవై వేలు సైతం కనిపించకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ తెలిపారు.

బెల్టుషాపులపై దాడులు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో రాజుగౌడ్, రాఘవేందర్, నవీన్ బెల్ట్ షాపుల్లో మద్యం అమ్ముతున్నారనే సమాచారంతో గురువారం ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బెల్టు షాపుపై దాడులు చేయగా 132 లీటర్ల మద్యం పట్టుబడింది. వీటి విలువ రూ.37వేలు ఉంటుందన్నారు. షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రాజుగౌడ్, రాఘవేందర్, నవీన్‌పై ఎక్సైజ్ యాక్టు ప్రకారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- సీఐ శివకుమార్
- మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు
- మైనర్లకు బైక్‌లు ఇవ్వొద్దని సూచన



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ శివకుమార్

అమరచింత: వాహనాలను నడుపుతున్న డ్రైవర్లు రహదారి నియమాలను తప్పనిసరిగా పాటించాలని సీఐ శివకుమార్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటో కెపాసిటీకి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీలను ఆటోలు ఉంచుకోవాలని సూచించారు. ప్రధాన రహదారుల వెంట ఎక్కడ పడితే అక్కడ ఆటోలను నిలపరాదన్నారు. క్యూలైన్ ప్రకారం ఆటోలను అడ్డల మీదకు తీసుకొచ్చి ప్రయాణికుల సౌకర్యార్థం ఉంచాలని తెలిపారు. ప్రతి డ్రైవర్ ఇన్సూరెన్స్ చేయించుకోవడంతో పాటు తమ వాహనాలకు సైతం బీమా సౌకర్యం కలిగి ఉండేలా చూడాలన్నారు. ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారికే వాహనాలను ఇవ్వాలని సూచించారు. కూలీలను తరలించే సమయంలో ఆటో డ్రైవర్లు రహదారి నియమావళికి గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ.సురేష్ కుమార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

బెల్ట్ షాప్‌పై దాడులు

మండలంలోని సింగంపేటలో గురువారం నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న బెల్టు షాప్‌పై దాడి చేసి 10 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ సురేష్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన నాగమ్మ అనే మహిళ అక్రమంగా బెల్టు షాపు నిర్వహిస్తుందన్న సమాచారం మేరకు ఆకస్మికంగా దాడులు నిర్వహించి మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోండి



దంతనూరులో ఎండిన పంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మదనాపురం: మండలంలోని దంతనూర్ శివారులో రైతులు గట్టన్న, చెన్నయ్య సాగు చేసి ఎండిన వరి పంటను గురువారం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2014 కంటే ముందున్న పరిస్థితులు పాలమూరు జిల్లాలో కనిపిస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు చెప్పిన మార్పు ఇదేనా అని ఎద్దేవా చేశారు. పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా చూడాలని డిమాండ్ చేశారు. రూ.2 లక్షల రుణ మాఫీ వెంటనే చేయాలన్నారు. ఎన్నికల ముందు తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను నిలువున మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం రైతుల పక్షాన ఉండి ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. రానున్న పార్లమెంటు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

మైనార్టీల అభ్యున్నతికి సహకరించాలి



మదనాపురం: మైనార్టీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని మండలంలోని దుప్పల్లి ముస్లింలు ఆయన స్వగ్రామం దమగ్నాపురంలో కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ముస్లిం కమ్యూనిటీ కోసం షాదీఖానాతో పాటు అనేక సమస్యలను వివరించామని నూరే మస్జిద్ కమిటీ అధ్యక్షుడు ఎండీ ఖాజామైనోద్దీన్ తెలిపారు. కార్యక్రమంలో ఖాసీం, నజీర్, సుల్తాన్, చాంద్‌పాషా, షర్ఫుద్దీన్, ఖాసీం, ఆఫ్రిద్, గౌస్, సాధిక్, మహమూద్, డబ్బా మహిమూద్, నిరంజన్, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫేర్



మానవ శరీర అవయవాలను వివరిస్తున్న విద్యార్థులు

ఆత్మకూర్: సైన్స్ ఫేర్ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఉత్సాహంతో పాటు సృజనాత్మకత పెరుగుతుందని, భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఎంతో దోహదపడుతాయని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, విండో అధ్యక్షులు గాడికృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ కోటేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవి యాదవ్ అన్నారు. ఆత్మకూర్‌లోని ఎంవీరామన్ పాఠశాలలో గురువారం మూడో రోజు నిర్వహించిన సైన్స్ ఫేర్ కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. ఇక్కడి విద్యార్థులు 650 రకాల సైన్స్ ఎక్స్ ప్రయోగాలు ప్రదర్శించడంతో ఇంటర్నేషనల్ వండర్ బుక్ రికార్డు నెలకొల్పి అవార్డును దక్కించుకోవడం అభినందనీయమన్నారు. సందర్భంగా మాజీ ఎంపీపీ డాక్టర్ మొగిలి శ్రీధర్‌గౌడ్, ప్రిన్సిపాల్ ఆన్సి శ్రీధర్లు విద్యార్థులను అభినందించారు.

నిధుల వినిమయ వివరాలు ఇవ్వండి



అమరచింత: మున్సిపాలిటీ ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు ఎన్ని నిధులు మంజూరయ్యాయి.. వాటి ద్వారా ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాన్న విషయాలను వివరాలతో ఇవ్వాలంటూ సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ పార్టీ మండల కార్యదర్శి రాజన్న డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ నురుల్ నదీంకు గురువారం సహచట్టం ద్వారా సమాచారం ఇవ్వాలని వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్‌కు వచ్చిన నిధుల్లో ఖర్చులు, అభివృద్ధి పనుల ఖర్చుల వివరాలను అందించాలని కోరారు. మున్సిపల్‌లో పారిశుద్ధ్య కార్మికుల నియామకం, వారికి చెల్లించే వేతనాల వివరాలు తెలపాలన్నారు. కార్యక్రమంలో కురుమన్న, మస్తమని, భక్తి తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ తొలగించాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని శ్వేతానగర్‌లో ఓ ఇంటిపై బిగించిన సెల్ టవర్ తొలగించాలని కౌన్సిలర్ చీర్ల సత్యం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ మేరకు గురువారం ఆ ఇంటి ఎదుట కాలనీవాసులతో కలిసి ఆందోళన వ్యక్తం చేశారు. ఆ భవనంలో ఉన్న వ్యాపారుల దుకాణాలకు కొద్దిసేపు తాళం వేశారు. అద్దెదారులు తమ జీవన ఉపాధికి దెబ్బ పడుతుందని ఆందోళన వ్యక్తం చేయగా కొద్దిసేపటికి ఆందోళనకారులు శాంతించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్, కాలనీ వాసులు మాట్లాడుతూ... టవర్ రేడియేషన్‌తో ప్రజలు అనారోగ్యంపాలవుతారని, మరీ ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు త్వరగా టవర్ నుంచి వెలువడే రేడియేషన్‌కు గురవుతారని చెప్పారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని టవర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌కు తరలిన పంచాయతీ కార్మికులు



పాన్‌గల్: తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్, సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమానికి గురువారం మండలం నుంచి పలువురు కార్మికులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, మల్టీపర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, ఇన్సూరెన్స్ తదితర సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఆయా డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్ పంచాయతీరాజ్ శాఖ కార్యాలయం ముందు నిర్వహించే సమావేశానికి తరలివెళ్తున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సుగ్రీవుడు, యాదగిరి, కిషన్, రాజు, అర్జునయ్య, తిరుపతయ్య, నాగన్న, లాల్యానాయక్, భాగ్యమ్మ, కృష్ణమ్మ, శాంతమ్మ, ఎల్లమ్మ తదితరులు తరలివెళ్లారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆందోళన



పాన్‌గల్ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

పాన్‌గల్: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు శానిటేషన్ సామగ్రి అందించాలని కోరుతూ తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్మయ్య, జిల్లా కార్యదర్శి గణేష్ మాట్లాడుతూ జీపీల్లో పనిచేస్తున్న కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెగ్యులర్‌గా వేతనాలు చెల్లించి కార్మికుల కుటుంబాల ఇబ్బందులు తొలగించాలని, కార్మికులు రోగాల బారిన పడకుండా ఉండేందుకు వారికి శానిటేషన్ సామగ్రిని అందించాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ కోటేశ్వర్‌కు అందజేశారు.

మత్స్యకళాశాల విద్యార్థులలకు అవగాహన



మరబోటులో రిజర్వాయర్‌లో తిరుగుతున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం జాతీయ సేవా పథకం శిబిరంలో భాగంగా ఎఫ్ఎల్‌డబ్ల్యూ ఈపీ ప్రోగ్రాం కింద పెబ్బేరు మత్స్య కళాశాల విద్యార్థులకు 7 రోజుల పాటు ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేట్ డీన్ డా.నాగలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో కలిసి గురువారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని మత్స్య సహకార సంఘం వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం లావాదేవీలు, రిజర్వాయర్ నుంచి చేపల సేకరణ, సంఘం ఎదుర్కొంటున్న సమస్యలపై ఎన్ఎస్ఎస్ వలంటీర్లు చర్చించి వారికి పలు సూచనలు చేశారు. అనంతరం మరబోట్లలో మత్స్యకారుల వెంబడి రిజర్వాయర్‌లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తిరుగుతూ చేపలు పట్టడం కోసం పలు సూచనలు చేస్తూ, ఆదాయాన్ని పెంచుకోవడంపై అవగాహన కల్పించారు. ప్రోగ్రాం అధికారి డా.దేవానంద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శివశంకర్‌శెట్టి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

అమరచింత: పట్టణానికి చెందిన కమిటి లక్ష్మారెడ్డి దశదిన కర్మ వేడుకల్లో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డిలతో పాటు పలువురు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు హాజరై బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విధంగా ఆత్మకూర్ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ నాగభూషణంగౌడ్ తల్లి మృతి విషయం తెలుసుకొని డీకే అరుణ వారి కుటుంబాన్ని పరామర్శించారు.

కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



గోపాల్‌పేట: ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నాగనిగారి ప్రీతం ను గురువారం వనపర్తి జిల్లా ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొంకి వెంకటేష్ హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారిని పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించారు. ఆయనతో పాటు రేవల్లి మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగశేషి, ఘనపూర్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు యాదగిరి, పెద్దమందడి ఎస్సీ సెల్ అధ్యక్షుడు గట్టు దయాకర్, గోపాల్‌పేట మండల సోషల్ మీడియా కన్వీనర్ ప్రవీన్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



గోపాల్‌పేటలో పోలింగ్ బూత్ పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

గోపాల్‌పేట: ఎన్నికలు జరిగే అన్ని కేంద్రాల్లో తగిన సౌకర్యాలు కల్పించాలని మండల అధికారులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. గురువారం ఆయన గోపాల్‌పేట, ఏదుల మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఉమ్మడి మండలంలోని తాడిపర్తి, చెన్నూరు, బుద్దారం, పొలికెపాడు, ఏదుట్ల, ఏదుల, అనంతరపురం గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. కేంద్రాల్లో కరెంటు సౌకర్యం, ఫ్యాన్లు, మెట్లు, ర్యాంపులు, వెలుతురు, తాగునీటి సౌకర్యం వంటివి తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని మండల అధికారులను ఆదేశించారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే ఉన్నతాధికారులు దృష్టికి తీసుకొచ్చి తగిన సౌకర్యాలు కల్పించుకోవాలని చెప్పారు. ఆయన వెంట ఎంపీఓ ఉసేనప్ప, మండల అధికారులు ఉన్నారు.

వీఓఏ తొలగింపుపై గ్రామ సంఘం సమావేశం



వీఓఏ తొలగింపుపై చర్చిస్తున్న సభ్యులు

పాన్‌గల్: మండలంలోని బహదూర్‌గూడెంలోని గ్రామ సంఘం వీఓఏ (గ్రామ ఆర్గనైజేషన్ అసిస్టెంట్) గోవర్ధన్‌రెడ్డిని విధుల నుంచి తొలగింపుపై గురువారం గ్రామంలో గ్రామ సంఘం సభ్యులు సమావేశం నిర్వహించారు. గ్రామ సంఘంలో ఎన్నో ఏళ్లుగా వీఓఏగా విధులు నిర్వహిస్తున్న అతడిని గ్రామ సంఘం తీర్మానం లేకుండా తొలగించడం సరికాదని, వీఓఏగా అతడినే మళ్లీ కొనసాగించాలని గ్రామ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఏకగ్రీవంగా చేసిన తీర్మానాన్ని డీఆర్‌డీఓ పీడీకి అందజేస్తామని వారు పేర్కొన్నారు. ఈ సమావేశానికి వీఓఏ సంఘం మండల నాయకులు రాజయ్యగౌడ్, శేషయ్యనాయుడు, ధర్మయ్య, గ్రామ సంఘం అధ్యక్షురాలు సునీత, కార్యదర్శి బాలకిష్టమ్మ పాల్గొన్నారు. ఈ విషయంపై ఐకేపీ సీసీ నాగరాజును వివరణ కోరగా వీఓఏగా పనిచేసిన గోవర్ధన్‌రెడ్డిని జిల్లా అధికారులు రెండున్నరేళ్ల క్రితమే తొలగించారు. ఇతడు జిల్లా అధికారులు నిర్వహించిన సమావేశానికి పలు మార్లు గైర్హాజరు కావడం, గ్రామ సంఘాలలో అవకతవకల కారణంతోనే తొలగించి, ఆ స్థానంలో మహిళను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.

51 ఏళ్ల తర్వాత 'అపూర్వ సమ్మేళనం'



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని బలిజపల్లి, జంగమాయపల్లి యూపీఎస్ పాఠశాలలో 1972–73 విద్యా సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారు 51ఏళ్ల తర్వాత కలుసుకున్నా.. అదే ఉత్సాహంతో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పుడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు వేణుగోపాల్ శెట్టి, నారాయణరెడ్డిని శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జగన్మోహన్‌గౌడ్, నరసింహారెడ్డి, వేణుగోపాల్‌శెట్టి, ప్రభాకర్‌రెడ్డి, మల్లెల నాగిరెడ్డి, నరసింహారావు, గోవర్ధన్‌రెడ్డి, యాదవరెడ్డి, గోపాల్‌రెడ్డి, పురుషోత్తంశెట్టి తదితరులు పాల్గొన్నారు.

'సాహిత్యం సమాజ హితం కోరుతుంది'



కవులను సన్మానిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: సాహిత్యం సమాజ హితాన్ని కోరుతుందని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలో ప్రపంచ కవితా దినోత్సవాన్ని సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్త మానవాళి అంగీకరించిన గొప్ప పద్ధతుల్లో కవిత్వం ఒకటని, మనస్సులోని భావాలను కళాత్మకంగా వర్ణించడమే కవిత అని చెప్పారు. సమాజంలో ఎంతో మంది వివిధ రకాల కవిత్వాలను రచించారని, పద ప్రయోగాలతో మనస్సు హత్తుకునేలా కవిత్వం చెప్పిన వారు కొందరైతే, పదునైన పదాలతో సమాజాన్ని చైతన్యపరిచిన వారు కొందరని అన్నారు. అదేవిధంగా దాదాపు 25 మంది కవులు కవితాగానం చేశారు. అనంతరం వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కవులు పగడాల వెంకటయ్య, జనజ్వాల, బైరోజు చంద్రశేఖర్, ఆకుల శివరాజ లింగం, బుచ్చయ్య, మల్యాల బాలస్వామి, సత్తార్, గంధం నాగరాజు, కృష్ణయ్య, బండారు శ్రీనివాస్, డా.శ్యామ్‌సుందర్, నిరంజనయ్య, వీరాచారి, రాములు యాదవ్, గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు



హఫీస్‌సాబ్‌లను సన్మానిస్తున్న ముస్లింలు

ఆత్మకూర్: పవిత్ర రంజాన్ మాసం మొదటి దశకం పూర్తయిన సందర్భంగా బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు స్థానిక ఇమాదుల్ ఉలూమ్ మదర్సా మసీదులో ప్రపంచ శాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ మాసంలోని తరావిహ్ నమాజ్ ముఖ్యమైనది, ప్రతి రోజు రాత్రి ఇషా నమాజ్ తర్వాత చదివే తరావిహ్ నమాజ్‌లో దివ్య ఖురాన్ పఠిస్తారు. మదర్సా మసీద్‌లో ప్రతి రోజు తరావి నమాజ్‌లో దివ్య ఖురాన్‌లోని మూడు పారాలు (భాగాలు) చదివి వినిపించారు. ఈ సందర్భంగా హఫీజే ఖురాన్‌లకు స్థానికులు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హాఫీజ్ సాబ్‌లు జియావూర్ రహెమాన్, ఉబేదుర్‌రహ్మాన్, ముక్తదీర్, రఫీయోద్దీన్, అబ్దుల్‌ఆలీం, షబ్బీర్, ఫకురుద్దీన్‌లను పూలమాలలు, మహెరుమాలతో సన్మానించారు. కార్యక్రమంలో రహ్మతుల్లా, హనీఫ్, ఇస్మాయిల్, సాదీఖ్, ఫేరోజ్, మహమ్మద్‌రఫీ, ఖుద్దూస్, వాహీద్, ఖాదర్, అఫ్రోజ్ ఇమ్రాన్‌లు పాల్గొన్నారు.

పశువుల సంత వేలం



వేలంలో పాల్గొన్న అధికారులు, స్థానికులు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో గురువారం పశువుల సంత వేలం పాట నిర్వహించారు. రూ.23,200 వేలకు బొక్కలయ్య పాటపాడి దక్కించుకున్నారు. తైబజార్ వేలం పాటను శనివారానికి వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి నాగశేషు తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ లక్ష్మన్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లోనే పోషక విలువలు



కనిమెట్టలో గర్భిణ్రులకు సీమంతాలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్ తిరుమలేశ్వరి



పర్వతాపురంలో..

సాక్షి, నెట్‌వర్క్: చిరుధాన్యాల్లోనే పోషకాలు ఎక్కువగా ఉంటాయని జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీబాయి, సీడీపీఓ కృష్ణ చైతన్య అన్నారు. గురువారం ఖిల్లాఘనపురంల మండలంలోని పర్వతాపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన గర్భిణి, బాలింతలు, కిశోర బాలికలకు పలు సూచనలు చేశారు. కొత్తకోట మండలంలోని కనిమెట్ట అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ తిరుమలేశ్వరి ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు చేశారు. వీపనగండ్ల మండలంలోని బొల్లారం అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. పెబ్బేరు మండలంలోని వై.శాఖాపూర్ గ్రామంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో చిరుధాన్యాలతో కూడిన పోషక పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పోషణ పక్షం వేడుకలు సీడీపీఓ లక్ష్మమ్మ, సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శి శేఖర్‌రెడ్డి, హెచ్‌ఎం లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.